క్లుప్తంగా

పరిశుభ్రత మనందరి బాధ్యత



జేగురుపాడులో పరిసరాలను శుభ్రం చేస్తున్న సర్పంచ్ స్టాలిన్

కడియం: పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత అని జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గ్రామంలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్టాలిన్ మాట్లాడుతూ ప్రతి శనివారం స్వచ్ఛభారత్ దివస్ అనే నినాదంతో గ్రామంలో చెత్తను సేకరించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. దీనిపై ప్రజలందరికీ అవగాహన కల్పించి, చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజలు చెత్తను తడి, పొడిగా వేరు చేసి పంచాయతీ పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అయినవిల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పాలపర్తి ప్రకాష్ కుమార్, యాదల మహేంద్ర వర్మ, ట్రినిటీ యూత్, గ్రామ ప్రజలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కాపునాడు జోన్ - 2 అధ్యక్షుడిగా రఘు నరేష్



నియామక పత్రం అందుకుంటున్న రఘు నరేష్

రాజమహేంద్రవరం సిటీ: కాపునాడు ఉభయ గోదావరి జిల్లాల (జోన్ – 2) అధ్యక్షుడిగా రాజమహేంద్రవరానికి చెందిన గుదే రఘు నరేష్ నియమితులయ్యారు. ఆయన శనివారం విజయవాడ కాపునాడు కేంద్ర కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. అనంతరం రఘు నరేష్ మాట్లాడుతూ కాపు సామాజికవర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి దుర్గేష్

ప్రకాశం నగర్: క్రీడల్లో రాణిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, రాజమహేంద్రవరాన్ని క్రీడాపరంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక ఎస్కేవీటీ మైదానంలోని గ్లాడియేటర్ క్రికెట్ క్లబ్ లెజెండ్స్ కప్–2025 క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, క్రికెట్ ఆడి ఉత్సాహ పరిచారు. నిరంతరం టోర్నమెంట్లు నిర్వహిస్తూ క్రీడలను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆర్యాపురం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రత్యేక ప్రణాళికతో పట్టణ ప్రాంతాలు అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాయని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. స్థానిక ఎస్వీజీ మార్కెట్ జంక్షన్, షెల్టన్ ఏరియా వంద అడుగుల ఆవ రోడ్డు, ఎస్‌టీపీ ప్రాంతాలను పబ్లిక్ హెల్త్ ఎస్ఈ పాండురంగారావుతో కలిసి శనివారం ఉదయం ఆయన పరిశీలించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌టీపీ ప్రాంతాన్ని సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలన చేశారు. ఈ ప్రాంతంలో నూతన క్రికెట్ స్టేడియం తీసుకొస్తున్నామన్నారు.

సినిమాలు



శ్యామల	:	సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	:	హాంకాంగ్ వారియర్స్
సూర్యప్యాలెస్	:	ఐడెంటిటీ
స్వామి	:	సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	:	సంక్రాంతికి వస్తున్నాం
అనుశ్రీ	:	గేమ్‌ఛేంజర్
రాజా	:	సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి	:	సంక్రాంతికి వస్తున్నాం
మేనక	:	పుష్ప–2, హత్య (మార్నింగ్ షో)
రంభ	:	సైకోఫోర్స్, గాంధీ తాత చెట్టు (మ్యాట్నీ)
కుమారి	:	పుష్ప–2
అప్సర	:	డాకు మహారాజ్
అశోక	:	డాకు మహారాజ్
నామవరం		
వీఎస్ మహల్	:	సంక్రాంతికి వస్తున్నాం
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	సంక్రాంతికి వస్తున్నాం
కడియం		
వెంకటసూర్య	:	సంక్రాంతికి వస్తున్నాం

మోగనున్న పెళ్లి బాజా..



జనార్దనస్వామి రథం



శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీజనార్దనస్వామి



ధవళగిరిపై స్వామివారి ఆలయం

- జనార్దనస్వామి కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు
- ఫిబ్రవరి 8 నుంచి 13 వరకూ నిర్వహణ
- చురుగ్గా జరుగుతున్న పనులు

ధవళేశ్వరం: ధవళేశ్వరం గ్రామంలోని ధవళగిరిపై కొలువైన జనార్దనస్వామి కల్యాణ మహోత్సవాలకు ఏర్పాటు చురుగ్గా జరుగుతున్నాయి. ధవళగిరిపై ఫిబ్రవరి 8 నుంచి 13 వరకూ వైభవంగా ఉత్సవాలను నిర్వహించనున్నారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామివారిగా పేరుగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీజనార్దనస్వామి దివ్య కల్యాణోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేల మంది రథోత్సవం, కల్యాణోత్సవం తిలకించేందుకు వస్తారు. ఆరు రోజుల పాటు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

రథోత్సవం

స్వామివారి కల్యాణోత్సవానికి ముందు నిర్వహించే రథోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఉత్సవాల కోసం ఇప్పటికే రథాన్ని బయటకు తీశారు. రథం వీధి నుంచి పోలీస్ స్టేషన్ వరకూ వైభవంగా రథోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహిస్తారు. అనంతరం రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుంది.

150 ఏళ్ల చరిత్ర

ధవళేశ్వరం జనార్దనస్వామి రథానికి 150 ఏళ్ల పైబడి చరిత్ర ఉంది. కల్యాణోత్సవానికి ముందు నిర్వహించే రథోత్సవానికి రాష్ట్రంలోనే విశేష ప్రాధాన్యత ఉంది. పూరీ తరువాత అంత భారీ రథం ధవళేశ్వరంలోనే ఉందని పూర్వీకులు చెబుతుంటారు. సుమారు 40 అడుగులు పొడవు కలిగిన దీన్ని ఒకే చెట్టు కలపతో నిర్మించారు. స్వామివారి రథాన్ని లాగితే కష్టాలు తొలగుతాయని భక్తుల నమ్మకం.

అరటిపండ్లు తగిలితే శుభం

స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా గ్రామ ఆడపడుచులు ఎక్కడున్నా తప్పనిసరిగా ఉత్సవాలకు వస్తారు. రథంపైన కట్టే గొడుగును భక్తులు అరటిపండ్లతో కొట్టడం ఆనవాయితీ. రథం గొడుగుకు తాము వేసే అరటిపండ్లు తగిలితే శుభం జరుగుతుందని గ్రామస్తుల ప్రగాఢ నమ్మకం. 1890లో జరిగిన రథోత్సవంలో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు పాల్గొన్నారు. అప్పుడు ఆయన విద్యార్థిగా ఉన్నారు. ఈ విషయాన్ని మహాకవి చిలకమర్తి లక్ష్మీ నరసింహ పంతులు పద్యరూపంలో వర్ణించారు. దీనిని వివరిస్తూ ఆలయం దిగువన శిలాఫలకాన్ని సైతం ఏర్పాటు చేశారు.

కల్లుగీత సంఘాలకే మద్యం షాపులివ్వాలి



విలేకరులతో మాట్లాడుతున్న కల్లుగీత కార్మికుల సొసైటీ నాయకుడు మట్టా శ్రీనివాసరావు

అల్కాటతోట (రాజమహేంద్రవరం రూరల్): మద్యం షాపుల కేటాయింపు విషయంలో కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడాలని రాజమహేంద్రవరం కల్లుగీత కార్మిక సహకార సంఘాలు విజ్ఞప్తి చేశాయి. స్థానిక కల్లుగీత సహకార సంఘం గ్రూప్ వన్, టు ప్రతినిధులు శనివారం ప్రెస్ క్లబ్ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లుగీత సహకార సంఘం గ్రూప్–1 కార్యదర్శి మట్టా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మట్టా శేషు మాట్లాడుతూ చంద్రబాబు, కూటమి నేతలు ఎన్నికలకు ముందు మద్యం షాపుల్లో కల్లుగీత సహకార సంఘాలకు 20 శాతం షాపులు కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించి మద్యం షాపుల్లో కేటాయింపులు 10 శాతానికి కుదించారన్నారు. అలాగే మద్యం షాపులను సంఘాలకు కాకుండా కులాలకు కేటాయించారన్నారు. దీని వల్ల ఆయా కులాల్లో ధనికులు, ముఖ్యమైన నేతలు మాత్రమే షాపులు చేజిక్కించుకుని లబ్ధి పొందుతున్నారన్నారు. మిగిలిన వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం షాపులను సంఘాలకు కేటాయిస్తే గీత కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. గ్రూప్ – 2 అధ్యక్షుడు రేలంగి చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ విధానం వల్ల గీత కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం తమ కార్మిక కుటుంబాలు పనిచేశాయని, అధికారంలోకి వచ్చాక షాపుల కేటాయింపుల్లో అన్యాయం చేయడం దారుణమన్నారు. సమావేశంలో కోలమూరు సంఘం అధ్యక్షుడు మేకా గణపతి, లాలాచెరువు సంఘం అధ్యక్షుడు టేకుమూడి అర్జునరావు పాల్గొన్నారు.

ఫార్మర్ ఫ్రెండ్లీ షూ ప్రాజెక్టుకు అవార్డు



స్పెషల్ జ్యూరీ బహుమతి సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కంబాలచెరువు: పుదుచ్చేరిలో ఈ నెల 21 నుంచి 25 వరకూ నిర్వహించిన సదరన్ ఇండియా సైన్స్ ఫేర్ 2025లో జిల్లాకు చెందిన 'ఫార్మర్స్ ఫ్రెండ్లీ షూ' అనే ప్రాజెక్టు సదరన్ ఇండియా స్థాయిలో స్పెషల్ జ్యూరీ బహుమతి సాధించిందని జిల్లా సైన్స్ అధికారి జి.నెహ్రూ తెలిపారు. గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జి.గీతాసౌమ్య, ఎస్.జ్యోత్స్న రూపొందించిన ఈ ప్రాజెక్టుకు గైడ్ టీచర్లగా వి.దుర్గాప్రసాద్, కె.శ్రీనివాసరావు వ్యవహరించారు. జాతీయస్థాయిలో మన జిల్లా సైన్స్ ప్రాజెక్టుకు ప్రత్యేక బహుమతి రావడంపై జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, డీవైఈవో ఈవీబీఎస్ నారాయణ హర్ష వ్యక్తం చేశారు.

అధిక దిగుబడుల దిశగా అడుగులు

రాజానగరం: రైతులు సాగు ఖర్చులను తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించే దిశగా అడుగులు వేయాలని, అందుకు అవసరమైన సాంకేతిక విజ్ఞానాన్ని అందించడానికి సమష్టి కృషి ఎంతో అవసరమని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ అన్నారు. దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రాన్ని శనివారం సందర్శించిన ఆయన.. కేంద్రం పనితీరును నిశితంగా పరిశీలించి, ఆ సమయంలో అక్కడ ఉన్న రైతులు, వ్యవసాయ విద్యార్థులకు సూచనలిచ్చారు. మినీకిట్లు, విత్తనాల పంపిణీ, శిక్షణ, వ్యవసాయ సలహాలు తదితర కార్యక్రమాల తీరును కూడా పరిశీలించారు. మరిన్ని నూతన సాంకేతిక పోకడలతో జిల్లా రైతాంగానికి వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల సమన్వయంతో సేవలు అందించాలన్నారు. అనంతరం రైతులు, వ్యవసాయ విద్యార్థులు వెలిబుచ్చిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

3 నుంచి ఆర్ట్స్ కళాశాలలో జాతీయ వర్క్‌షాప్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర, అధ్యాపకులు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3 నుంచి 7వ తేదీ వరకూ 'రేడియో కెమిస్ట్రీ, రేడియో ఐసోటోప్‌ల అనువర్తనాలు'పై ఐదు రోజుల జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈ మేరకు వర్క్‌షాప్ పోస్టర్లను భౌతిక శాస్త్ర విభాగాధిపతి సీహెచ్ కోమల లక్ష్మి, వర్క్‌షాప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి.గౌరీ నాయుడు సమక్షంలో శనివారం ఆయన విడుదల చేశారు. భౌతిక శాస్త్ర విభాగం నుంచి అధ్యాపక సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రేడియో కెమిస్ట్రీ, ఫిజిక్స్ రంగంలో విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు దీని ప్రాముఖ్యతను చెప్పారు. ఈ జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను భారత ప్రభుత్వంలోని అణుశక్తి విభాగం (డీఏఈ), బాబ అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బీఏఆర్‌సీ) నుంచి వచ్చిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూక్లియర్ కెమిస్ట్రీస్ అండ్ అలైడ్ సైంటిస్ట్స్ (ఐఏఎన్‌సీఏఎస్) ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని తెలిపారు. రేడియో కెమిస్ట్రీ, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమ, పర్యావరణ శాస్త్రం వంటి రంగాలలో రేడియో ఐసోటోప్‌ల విభిన్న అనువర్తనాలపై పాల్గొనే వారికి సమగ్ర అవగాహన కల్పించడం దీని లక్ష్యమన్నారు.

బాలికల హక్కులు కాపాడటం అందరి బాధ్యత



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫ్రెడ్రిక్ పరదేశి బాబు తదితరులు

కంబాలచెరువు: బాలికల హక్కులు కాపాడటం అందరి బాధ్యత అని వక్తలు అన్నారు. జాంపేట లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. 'బాలికలు బంగారం – వారి బాల్యం కాపాడడం మన బాధ్యత' అనే నినాదంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర ఫ్రో చైల్డ్ గ్రూప్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను లూథరన్ విద్యాసంస్థల మేనేజర్, ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చి మోడరేటర్ కె.ఫ్రెడ్రిక్ పరదేశిబాబు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు వివక్ష లేకుండా తమ పిల్లలను పెంచాలన్నారు. వారికి అభిరుచి ఉన్న రంగాలలో ప్రోత్సాహం అందించాలన్నారు. ఏఈఎల్‌సీ కోశాధికారి కె.ఆర్నాల్డ్ మోజెస్, కౌన్సిల్ మెంబర్, సామాజిక కార్యకర్త కె.మిల్టన్ లూథర్ శాస్త్రి, లూథరన్ ఉన్నత పాఠశాల కరెస్పాండెంట్ ఎం.ఐజయ, ఎస్.మేరీ పెరల్స్ పాల్గొన్నారు.

అదరగొట్టిన లోకల్ సెలబ్రిటీ షో



కందుల దుర్గేష్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు. చిత్రంలో సోము వీర్రాజు, షర్మిలారెడ్డి, డాక్టర్ భద్రం, పృథ్వీరాజ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో శనివారం రాత్రి జరిగిన లోకల్ సెలబ్రిటీ షోలో స్థానిక ప్రముఖులు సందడి చేశారు. ఔత్సాహిక నటీనటులు, కళాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు భద్రమ్ ఫిల్మ్‌హౌస్ ఆధ్వర్యంలో హాస్యనటుడు డాక్టర్ భద్రం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ఔత్సాహిక కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు, సినీనటులు పృథ్వీరాజ్, జోష్ రవి, వికటకవి డైరెక్టర్ ప్రదీప్ హాజరయ్యారు. లోకల్ సెలబ్రిటీ షో ద్వారా కళాకారులు ఉన్నతస్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. డాక్టర్ భద్రం మాట్లాడుతూ సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన ఈ షోను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాసరచనలో రేణుక ప్రతిభ



కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న రేణుక

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో బొమ్మూరు జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎం.రేణుక ద్వితీయస్థానం సాధించింది. ఆనం కళాకేంద్రంలో శనివారం జరిగిన జాతీయ ఓటరు దినోత్సవంలో కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంది. రేణుకను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడాకారిణికి చెక్కు అందజేత



పూజితకు చెక్కు అందజేస్తున్న మానవత సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మానవత సేవాసంస్థ నిరంతరం కృషి చేస్తోందని అధ్యక్షుడు పాల కృష్ణ ప్రసాదరెడ్డి అన్నారు. జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికై, రాజస్థాన్‌లోని ఉదయపూర్‌కు వెళుతున్న క్రీడాకారిణి పూజితకు ఆ సంస్థ సభ్యులు సమకూర్చిన రూ.18,500 చెక్కును డాక్టర్ కొమ్మ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ బీఎస్ఎన్ మూర్తి, మెహర్ మధు, చీఫ్ అడ్వైజర్ రుద్రమదేవి, సెక్రటరీ ఉప్పల శ్రీను, జాయింట్ సెక్రటరీ బొదిరెడ్ల అప్పారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంవిధాన్ దివస్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగబాబు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని వెంకటగిరి–2లో రూరల్ మూడవ మండలం 64వ పోలింగ్‌బూత్ అధ్యక్షురాలు కాళ్ల మంగాదేవి ఆధ్వర్యంలో శనివారం సంవిధాన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు మట్టా నాగబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని మాజీ మండల అధ్యక్షుడు ఎస్‌వీబీఎస్ ఆచారి సభకు వివరించారు. బీజేపీ జిల్లా మాజీ కార్యదర్శి తనుబుద్ధి సూర్య భాస్కరరావు కేంద్ర మంత్రి అమిత్ షా ఇచ్చిన సందేశాన్ని వినిపించారు.

అధ్యాపకురాలు రజనీకి డాక్టరేట్



రజనీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర, అధ్యాపకులు

కంబాలచెరువు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్.రమేష్ రాజు పర్యవేక్షణలో నిర్వహించిన పరిశోధనకు ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకురాలు చేబ్రోలు రజనీకి డాక్టరేట్ లభించింది. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే తెలిపారు. ఈ సందర్భంగా లెక్చరర్ రజనీకి రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, సీనియర్ అధ్యాపకులు జాకబ్, శ్రీధర్, జె.సురేష్ అభినందనలు తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

కంబాలచెరువు: ఉరి వేసుకుని వివాహిత మృతి చెందిన సంఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పనసచెట్టు సెంటర్‌కు చెందిన సాలా బాల పరమేశ్వరి (35)కి భర్త చనిపోయాడు. ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తోంది. శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందులతో ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



ఓటు ఆకారంలో కూర్చున్న కడియం జెడ్పీ హైస్కూలు విద్యార్థులు

కడియం: కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ చేశారు. సర్పంచ్ మోసిగండి సత్యవతి, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురాం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ అధ్యక్షతన సభా కార్యక్రమం జరిగింది. ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ మాట్లాడుతూ 1950 జనవరి 25న భారత ఎన్నికల కమిషన్ ఏర్పడిన రోజునే జాతీయ ఓటరు దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ అందరితో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లు ఉప్పులూరి చిట్టియ్య, మహాలక్ష్మిలను సత్కరించారు. విద్యార్థులకు వన్ కె రన్, ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

సీటీఆర్ఐ: మంచి నాయకులను,మంచి పాలనను పొందడానికి ప్రతి ఒక్కరూ ఓటు హక్కుని వినియోగించుకోవాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వేంకటేశ్వర ఆనంకళాకేంద్రంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో కళాశాలకు చెందిన విద్యార్థినులు బహుమతులు గెలుచుకున్న సందర్భంగా కళాశాలలో ఆమె సిబ్బంది, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. .

వంద అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ

రాజమహేంద్రవరం రూరల్: రిపబ్లిక్‌డే సందర్భంగా బొమ్మూరు బాలాజీపేట ఏఎల్ఎన్ బ్లోసమ్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్లో శనివారం వంద అడుగుల జాతీయ పతాకంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేశారు. రాజ్యాంగం , గణతంత్ర దినోత్సవం ప్రాముఖ్యత తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించినట్టు కరస్పాండెంట్ ఏఎస్ రవీంద్ర తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఏ.రశ్మిత, డాక్టర్ లక్ష్మీసుష్మిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాతేరు హైస్కూల్‌లో..

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కాతేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవా అనిత తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయతో కలిసి పాఠశాల ఆవాస ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. అనిత మాట్లాడుతూ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జనవరి 25న నిర్వహించుకుంటున్నామన్నారు. 2011లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రధానంగా ఓటు హక్కు ప్రాముఖ్యతను అందరికీ తెలియజేయడం, యువ ఓటర్లను ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు ప్రోత్సహించడం, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడం లక్ష్యంగా నిర్దేశించారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రశాంతి నుంచి బహుమతులు అందుకుంటున్న కళాశాల విద్యార్థినులు



కడియంలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ తదితరులు



గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాతో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు